సంక్షిప్త వార్తలు

ఐబీ చీఫ్ పదవీ కాలం మరో ఏడాది పొడిగింపు

న్యూఢిల్లీ: ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) అధిపతి తపన్ కుమార్ డేకా పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. 2026 జూన్ వరకు ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలని క్యాబినెట్ నియామకాల కమిటీ నిర్ణయించింది. ఇది ఆయనకు రెండవ పొడిగింపు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన డేకా 2022 జూన్‌లో ఐబీ డైరెక్టర్‌గా మొదటి సారి రెండేళ్ల పదవీకాలానికి నియమితులయ్యారు. గత ఏడాది జూన్‌లో ఆయన పదవీ కాలాన్ని ఏడాదిపాటు ప్రభుత్వం పొడిగించగా ఇప్పుడు మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

తుర్కియే, అజర్ బైజాన్‌కు 42% తగ్గిన వీసా దరఖాస్తులు

న్యూఢిల్లీ: తుర్కియే, అజర్ బైజాన్‌కు భారతీయుల వీసా దరఖాస్తులు 42 శాతం తగ్గాయి. ఇటీవల భారత్-పాక్ సైనిక ఘర్షణలో ఈ రెండు దేశాలు పాక్ పక్షాన నిలిచాయి. ఈ నేపథ్యంలో భారత పర్యాటకులు ఆ రెండు దేశాల సందర్శనకు గుడ్ బై చెప్పేస్తున్నారు. వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫామ్ అట్లీస్ నివేదిక ప్రకారం కేవలం 36 గంటల్లో దరఖాస్తుదారులు తమ అప్లికేషన్‌ను మధ్యలోనే ఉపసంహరించుకోవడం 60 శాతం పెరిగింది. ఇదే సమయంలో వియత్నాం, థాయ్‌లాండ్, ఈజిప్ట్‌ల సందర్శనకు వీసా దరఖాస్తులు 31 శాతం పెరిగాయి.

యూసుఫ్ పఠాన్ బోట్.. అభిషేక్ బెనర్జీ ఇన్

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్‌జాతీయ కార్యదర్శి, లోక్‌సభ ఎంపీ అభిషేక్ బెనర్జీ విదేశాల్లో భారత ఉగ్రవాద వ్యతిరేక వైఖరిని వివరించే ప్రతినిధుల బృందంలో సభ్యుడయ్యారు. గతంలో కేంద్రం ఈ బృందంలోకి ఎంపిక చేసిన టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ ప్రతినిధుల బృందం నుంచి వైదొలిగారు. మంగళవారం టీఎంసీ ఈ విషయాన్ని వెల్లడించింది. తమ పార్టీ సూచించిన వారినే అఖిల పక్ష బృందంలోకి తీసుకోవాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం మమతతో భేటీ అయ్యారు. అనంతరం కేంద్రం అభిషేక్ బెనర్జీని అఖిల పక్ష బృందంలోకి తీసుకున్నది.

ఆప్ విద్యార్థి విభాగం ఏఎస్‌ఏపీని ప్రారంభించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఆప్ విద్యార్థి విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ప్రకటించారు. దీనికి 'అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఫర్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్'(ఏఎస్ఏపీ)గా నామకరణం చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఓటమి మూటగట్టుకోవడంతో పాటు ఆ పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లు రాజీనామా చేసి, ఇంద్రప్రస్థ వికాస్ పార్టీ(ఐవీపీ)ని ప్రకటించారు. దీంతో ఆయన రంగంలోకి దిగారు. ఈ విద్యార్థి విభాగం విద్యారంగంలో మార్పు కోసం ఉద్యమించడంతో పాటు ప్రత్యామ్నాయ రాజకీయాల్లో మార్పునకు సంకేతంగా నిలుస్తుందని చెప్పారు.

స్పెయిన్‌లో నిలిచిన మొబైల్ నెట్‌వర్క్ సేవలు

మాడ్రిడ్: స్పెయిన్ అంతటా ప్రధాన మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌లు పనిచేయకుండా మొరాయించాయి. స్పెయిన్‌లోని నెట్‌వర్క్‌ల ప్రధాన ప్రొవైడర్ డిటెక్టర్, స్పానిష్ టెలికం దిగ్గజం టెలిఫోనికా నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడంతో మొబైల్ వినియోగదారులు ఫోన్‌కాల్స్ చేసుకోలేకపోయారు. అలాగే సందేశాలు నిలిచిపోయాయి, మొబైల్ డాటాను కూడా వినియోగించుకోలేక పోయారు. టెలిఫోనికా తన నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్న కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఏప్రిల్‌లో స్పెయిన్, పోర్చుగల్‌లలో గ్రిడ్ వైఫల్యం వల్ల దేశవ్యాప్తంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే.

విరిగిన కొండ చరియలు.. చిక్కుకున్న కైలాస యాత్రికులు

న్యూఢిల్లీ: ఆది కైలాస పర్వతానికి వెళ్లే మార్గంలో కొండ చరియ విరిగిపడడంతో ఉత్తరాఖండ్‌లోని పితోరాగఢ్ జిల్లాలో వందలాది మంది యాత్రికులు చిక్కుకుపోయారు. మార్గాన్ని పూర్తిగా కొండ చరియ కప్పేయడంతో యాత్రికులు, స్థానికులు ముందుకు పోలేక అక్కడే చిక్కుకుపోయారు. సరిహద్దు రోడ్ల సంస్థ(బీఆర్ఓ) సిబ్బంది శిథిలాలను తొలగించి సాధ్యమైనంత త్వరలో రోడ్డును పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని కుమావూ ప్రాంతంలో ఉన్న ఆది కైలాస పర్వతాన్ని సందర్శించేందుకు హిందువులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

కన్నడ నటి రన్యా రావుకు బెయిల్

బెంగళూరు: గోల్డ్ స్మగ్లింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కన్నడ నటి రన్యా రావు, తరుణ్ కొండూరు రాజ్‌లకు ప్రత్యేక కోర్టు మంగళవారం డీఫాల్ట్ బెయిల్ మంజూరుచేసింది. వారిద్దరు చట్టబద్ధమైన బెయిల్‌కు అర్హులేనని, ఇద్దరు వ్యక్తుల నుంచి వ్యక్తిగత పూచికత్తు, ఒక్కొక్కరు రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్‌ను సమర్పించిన తర్వాత వారిని బెయిల్‌పై విడుదల చేయాలని అర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. విచారణ జరిగే అన్ని తేదీల్లో కోర్టు ముందు హాజరు కావాలని, దర్యాప్తునకు అన్ని విధాలుగా సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని కోర్టు షరతులు విధించింది.

స్వర్ణదేవాలయంలో ఆయుధాల్ని మోహరించలేదు: ఆర్మీ

న్యూఢిల్లీ: అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో వైమానిక రక్షణ వ్యవస్థను మోహరించారన్న వార్తల్ని భారత సైన్యం ఖండించింది. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన వెంటనే స్వర్ణదేవాలయాన్ని టార్గెట్ చేస్తూ పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులకు దిగింది. దీనికి కౌంటర్‌గా భారత సైన్యం స్వర్ణదేవాలయంలో ఆయుధ వ్యవస్థను(ఎయిర్ డిఫెన్స్ గన్స్) ఏర్పాటుచేసిందన్న వదంతులు వ్యాపించాయి. వీటిని ఖండిస్తూ భారత సైన్యం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. స్వర్ణ దేవాలయం ప్రధాన పూజారి గియానీ రఘుబీర్‌సింగ్ కూడా మీడియాలో వచ్చిన కథనాలను ఖండించారు. స్వర్ణదేవాలయం లోపల, ఆవరణలో ఎయిర్ డిఫెన్స్ గన్స్ ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు.

పాక్‌పై చిన్నపాటి యుద్ధమన్న ఖర్గే.. బీజేపీ ఆగ్రహం

బెంగళూరు: ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాకిస్థాన్‌పై ప్రభుత్వం చిన్నపాటి యుద్ధం చేస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. ఇక్కడా అక్కడా చేస్తున్న చిన్న చిన్న యుద్ధాలతో భారత్‌పైన పాక్ పైచేయి సాధించినట్లు చెప్పుకుంటోందని ఆయన చెప్పారు. మంగళవారం కర్ణాటకలోని విజయనగరలో సమర్పణే సంకల్ప ర్యాలీలో ఖర్గే ప్రసంగిస్తూ జమ్ము కశ్మీరులోని పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో మరణించిన 26 మంది ప్రజల ప్రాణాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది.

బంగ్లాలో యూనస్, ఆర్మీ చీఫ్ మధ్య విభేదాలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మొహమ్మద్ యూనస్, సైన్యాధ్యక్షుడు వకర్-ఉజ్-జమాన్ మధ్య దూరం పెరిగిందా? అవుననే జవాబిస్తున్నాయి సైనిక వర్గాలు. ప్రజాస్వామిక ప్రభుత్వ ఏర్పాటు కోసం కార్యాచరణను కనుగొనేందుకు బంగ్లాదేశ్ సైన్యాధ్యక్షుడు మంగళవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో సాధ్యమైనంత త్వరలో ఎన్నికలను యూనస్ ప్రకటించాలని జమాన్ కోరుకుంటున్నారు. విదేశీ జోక్యం కారణంగా దేశంలో అస్థిరత పెరిగిపోతుందని ఆయన ఆందోళన చెతుతున్నారని, విదేశీ శక్తుల చేతిలో యూనస్ కీలుబొమ్మగా మారిపోయారని కూడా ఆయన భావిస్తున్నారని వర్గాలు వెల్లడించాయి.

సంగారెడ్డిలో నిఘా వర్గాలు అప్రమత్తం

సంగారెడ్డి, మే 20 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ఉగ్రమూలాలను వెతికే పనిలో కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు నిమగ్నమయ్యాయి. ఇటీవల సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ మండలం గొల్లపల్లిలో పాకిస్థాన్‌కు రహస్యంగా సమాచారం చేరవేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన మోహిజుల్ ఇస్లాం(19)ను అస్సాం టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. మోహిజుల్ ఇస్లాం భారతదేశంకు చెందిన సిమ్ కార్డులు పాకిస్థాన్ వారు ఉపయోగించుకునేందుకు సహకరించాడు. ఇస్లాం వద్ద నుంచి పెద్ద సంఖ్యలో నకిలీ సిమ్‌కార్డులతో పాటు కొన్ని పత్రాలను అస్సాం టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మోహిజుల్ ఇస్లాం అరెస్టు సంగారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. దీంతో సంగారెడ్డి జిల్లా పోలీసులతో పాటు నిఘా వర్గాలు అప్రమత్తం అయ్యాయి.

విదేశీ కలలు మానండి!

- అమెరికా, బ్రిటన్, కెనడాల్లో ఉద్యోగాల్లేవు
- తల్లిదండ్రులారా కోట్లు ఖర్చుపెట్టే ముందు ఆలోచించండి
- భారతీయ పారిశ్రామికవేత్త రాజేశ్ సాహ్నీ హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 20: విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకొని అక్కడే ఉద్యోగాల్లో స్థిరపడాలని కలలు కనడం మానండి అని గుర్గావ్‌కు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్త రాజేశ్ సాహ్నీ భారతీయులకు సూచించారు. అమెరికా, బ్రిటన్, కెనడా దేశాల్లో అంతర్జాతీయ విద్యార్థులకు జాబ్ మార్కెట్ లేదని, ముఖ్యంగా ఐఐటీ ఇంజినీర్లు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని ఎక్స్ వేదికగా హెచ్చరించారు. ఎక్స్‌లో ఆయన పోస్ట్ వైరల్‌గా మారింది. 'అమెరికా, బ్రిటన్, కెనడాల్లో అంతర్జాతీయ విద్యార్థులకు ఉద్యోగాల్లేవు. హనీమూన్ అయిపోయింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఖరీదైన చదువును ఇప్పించి చేందుకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి' అని రాజేశ్ హెచ్చరించారు.

ఇప్పుడా పరిస్థితి లేదు..

'ఇంజినీరింగ్ విద్యార్థులు ముఖ్యంగా ఐఐటీయన్లు అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ సంపాదించి రెండు లక్షల డాలర్ల జీతం వచ్చే ఉద్యోగం సంపాదించవచ్చు అనుకొనేవారు. అది ఇక ఎంతమాత్రం పనిచేయడం లేదు' అని రాజేశ్ పేర్కొన్నారు. భారతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో రాజేశ్ సాహ్నీ ఎంతో పేరెన్నికగన్నారు. జీఎస్ఎఫ్ యాక్సెలరేటర్ సంస్థకు వ్యవస్థాపకుడు, ప్రస్తుతం సీఈవో. హార్వర్డ్ బిజినెస్ స్కూల్ పూర్వ విద్యార్థి, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పెలోగా ఉన్నారు. రాజేశ్ పోస్ట్ వైరల్‌గా మారిన నేపథ్యంలో అనేకమంది ఇదే విధమైన అభిప్రాయాలు వ్యక్తంచేశారు. '2017లో కోర్సు పూర్తయిన కొద్ది రోజుల్లోనే 1.50 లక్షల డాలర్ల ఉద్యోగం సంపాదించే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు గూగుల్ వంటి టాప్ సంస్థలు కూడా లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి' అని ఒక యూజర్ పేర్కొన్నారు.

వీసా నిబంధనలు కఠినతరం

అమెరికా, బ్రిటన్‌తోపాటు కెనడా కూడా ఇటీవలి కాలంలో వీసా నిబంధనలను కఠినతరం చేసింది. అంతర్జాతీయ విద్యార్థులకు విద్యానంతరం ఉద్యోగం చేసే గడువును ఇటీవలే బ్రిటన్ రెండేండ్ల నుంచి 18 నెలలకు తగ్గించింది. అమెరికా, కెనడా కంపెనీలు సైతం అంతర్జాతీయ విద్యార్థుల కోసం అవకాశాలను తగ్గించివేస్తున్నాయి. బ్రిటన్‌లో మాస్టర్స్ చేసిన జాహ్నవీ జైన్ అనే భారతీయ మహిళ.. 90 శాతం మంది తన సహచర భారతీయ విద్యార్థులు యూకేలో ఉద్యోగ అవకాశాలు లేక భారత్‌కు తిరిగి వెళ్లారని తెలిపారు.

వివాహేతర సంబంధంతో విడాకులు..

భరణానికి అనర్హులు

ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు

రాయ్‌పూర్, మే 20: వివాహేతర సంబంధం కారణాలతో విడాకులు పొందిన మహిళ భరణాన్ని పొందేందుకు అనర్హురాలని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఆ మహిళకు నెలకు రూ.4 వేల భరణం చెల్లించాలంటూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును, తన భరణం మొత్తాన్ని పెంచాలంటూ భార్య చేసిన విజ్ఞప్తిని హైకోర్టు కొట్టివేసింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125(4) ప్రకారం వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళకు భరణం పొందే హక్కు లేదని జస్టిస్ అరవింద్ కుమార్ వర్మ మే 9న ఇచ్చిన తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాల్లోకి వెళితే.. రాయ్‌పూర్‌కు చెందిన ఒక జంటకు 2019లో హిందూ సంప్రదాయ ప్రకారం వివాహమైంది. అయితే భర్త తనను శారీరక, మానసిక హింస పెడుతున్నాడని ఆరోపిస్తూ 2021 మార్చిలో భార్య అత్తింటిని వదిలి వెళ్లిపోయింది. భరణం కోసం రాయ్‌పూర్ ఫ్యామిలీ కోర్టులో కేసు దాఖలు చేసింది. అయితే ఆమె తన తమ్ముడితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, ఇదేమని ప్రశ్నిస్తే తప్పుడు కేసు పెడతానంటూ బెదిరిస్తున్నదని, ఆమె నుంచి తనకు విడాకులు కావాలంటూ భర్త కేసు పెట్టారు. 2023, సెప్టెంబర్ 8న ఫ్యామిలీ కోర్టు అతనికి విడాకులు మంజూరు చేసింది. తర్వాత నెలకు ఆమెకు రూ.4 వేలు భరణం కింద చెల్లించాలంటూ నవంబర్ 6న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ భరణాన్ని 20 వేలకు పెంచాలంటూ ఆమె మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని సవాల్ చేస్తూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు.

మళ్లీ కరోనా కలవరం!

- దేశంలో పెరుగుతున్న కేసులు
- ముంబైలో ఇద్దరి మృతి
- ప్రస్తుతం 257 యాక్టివ్ కేసులు
- కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కొత్త కేసుల నమోదు
- ఆందోళన అక్కర్లేదన్న అధికారులు

న్యూఢిల్లీ: దక్షిణాసియాలో కొవిడ్-19 కేసులు పెరుగుతున్న క్రమంలో భారత్‌లోనూ కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని వారు తెలిపారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించినట్లు వారు చెప్పారు. ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ దవాఖానలో గత వారం కొవిడ్ సోకినట్లు నిర్ధారణ అయిన రోగులలో ఓ మైనర్‌తోసహా ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఈ రోగులకు దీర్ఘకాలిక రోగాలు కూడా ఉన్నాయని డాక్టర్లు తెలిపారు.

తేలికపాటి లక్షణాలే..

కేరళలో గతవారం రోజుల్లో 69 కొత్త కేసులు నమోదు కాగా, మహారాష్ట్రలో 44, తమిళనాడులో 34 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో ప్రస్తుతం 56 యాక్టివ్ కేసులు ఉన్నట్లు ఐసీఎంఆర్ తెలిపింది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ డివిజన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, కేంద్ర ప్రభుత్వ దవాఖానలకు చెందిన నిపుణులతో సోమవారం ఢిల్లీలో సమీక్షా సమావేశం జరిగింది. దేశంలో కొవిడ్-19 పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉందని సమావేశం నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు ఉన్నాయని, దేశ జనాభాను దృష్టిలో ఉంచుకుంటే ఇది చాలా తక్కువని అధికార వర్గాలు తెలిపాయి. ఈ కేసులలో చాలావరకు అన్నీ తేలికపాటి లక్షణాలతో ఉన్నవని, కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని దవాఖానలో ఉంచి చికిత్స అందచేయవలసిన అవసరం లేదని వారు చెప్పారు.

ఆ దేశాల్లో పెరుగుదల

సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటివారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.

పార్కింగ్ ప్లేస్ ఉంటేనే వాహనాలకు రిజిస్ట్రేషన్

మహారాష్ట్రలో కొత్త పాలసీ

ముంబై, మే 20: సంబంధిత పురపాలక సంస్థ నుంచి పార్కింగ్ ప్లేస్ కేటాయించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని కొనుగోలుదారులు చూపించిన తర్వాతే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ జరుగుతుందని మహారాష్ట్ర రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ ప్రకటించారు. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్(ఎంఎంఆర్)లో పెరుగుతున్న పార్కింగ్ సంక్షోభాన్ని, వాహనాల రద్దీని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త పార్కింగ్ విధానంపై ఉన్నత స్థాయి సమావేశం అనంతరం మంత్రి సర్నాయక్ సోమవారం ఈ ప్రకటన చేశారు. పార్కింగ్ ప్రదేశాలను నిర్మించాలని తాము ఆలోచిస్తున్నామని విలేకరులతో మాట్లాడుతూ మంత్రి తెలిపారు. బిల్డర్లు డెవలప్‌మెంట్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఫ్లాట్లతో పాటు పార్కింగ్ ప్లేస్‌ను కూడా డెవలపర్లు చూపించాలని ఆయన చెప్పారు. సంబంధిత మున్సిపల్ సంస్థ నుంచి ఆ పార్కింగ్ స్పేస్ కేటాయింపు సర్టిఫికెట్ లేకపోతే కొనుగోలుదారుడి కొత్త వాహనానికి రిజిస్ట్రేషన్ జరగబోదని ఆయన స్పష్టం చేశారు. ఎంఎంఆర్‌లో పార్కింగ్‌కు తీవ్రమైన కొరత ఉందని మంత్రి అంగీకరించారు.

మూడేండ్ల లా ప్రాక్టీస్ తప్పనిసరి

జ్యుడీషియల్ సర్వీస్ పోస్టులపై సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ, మే 20: జ్యుడీషియల్ సర్వీస్‌లో చేరాలనుకునే అభ్యర్థులు కనీసం మూడేండ్లపాటు లా ప్రాక్టీస్ చేసి ఉండాలన్న గతంలోని నిబంధనను సుప్రీంకోర్టు తిరిగి ప్రవేశపెట్టింది. న్యాయమూర్తులకు ప్రాక్టికల్ అనుభవం లేకపోవటం వివిధ సమస్యలకు దారితీస్తున్న సంగతిని గమనించి, 2002లో ఎత్తివేసిన నిబంధనను తిరిగి తీసుకొస్తున్నట్టు సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. మున్సిఫ్ మెజ్రిస్టేట్‌గా జ్యుడీషియల్ సర్వీస్‌లో చేరాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా న్యాయవాదిగా మూడేండ్ల అనుభవాన్ని కలిగి ఉండాలని ధర్మాసనం పేర్కొన్నది. 'సివిల్ జడ్జీల పరీక్షను రాసే అభ్యర్థులకు మూడేండ్ల లా ప్రాక్టీస్ రూల్ తప్పనిసరి. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు సివిల్ జడ్జీల పరీక్ష నిబంధనల్ని మార్చాలి' అని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది.

బెంగళూరులో కారులో వాన నీరు

విజయనగరలో జరిగిన సమర్పణె సంకల్ప ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

అటు వరదలు.. ఇటు వేడుకలు

- కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు తీరిది
- బెంగళూరు మునుగుతుంటే సంబరాలు చేసుకుంటారా?
- భారీ వర్షాలను పట్టించుకోరా?
- సిద్ధూ ప్రభుత్వ తీరుపై విమర్శలు

హోసపేటె, మే 20: భారీ వర్షాలకు బెంగళూరు అతలాకుతలం అవుతున్నది. 48 గంటల వ్యవధిలో ముగ్గురు మరణించారు. అయితే ప్రజల బాధలు, కష్టాలు, ఇబ్బందులు ఏమాత్రం పట్టని అధికార కాంగ్రెస్ మాత్రం హోసపేటెలో తన రెండో వార్షిక వేడుకల్లో నిమగ్నమై ఉంది. అధికారంలోని వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సమర్పణ సంకల్ప సమావేశం పేరిట మంగళవారం బహిరంగ సమావేశాన్ని నిర్వహించింది. దీనిని పౌరులతో పాటు విపక్ష బీజేపీ తీవ్రంగా ఆక్షేపించింది. భారీ వర్షాలు బెంగళూరును ముంచెత్తుతుంటే హోస్పేటలో వార్షిక వేడుకలు ప్రారంభించడాన్ని తప్పుపట్టింది.

మోకాళ్లలోతు నీరు..

బెంగళూరులో వారాంతం, సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సాయి లేఅవుట్, మాన్యతా టెక్ పార్క్, సిల్క్ బోర్డ్ జంక్షన్ సహా పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి.ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో లేకపోవడం బాధ్యతా రాహిత్యం, వేడుకలు జరుపుకోవడం దారుణమని బీజేపీ విమర్శించింది.

గుంతల రోడ్డు.. రూ.50 లక్షల పరిహారం కోరుతూ నోటీసు

ఘోరమైన ట్రాఫిక్ జామ్‌లే కాదు.. అస్తవ్యస్త, అధ్వాన రోడ్లు బెంగళూరు నగర పౌరులకు నిత్యం నరకాన్ని చూపిస్తున్నాయి. దీంతో విసిగిపోయిన 43 ఏండ్ల బెంగళూరు వాసి బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ)కి లీగల్ నోటీస్ పంపారు. తమ వేదనకు పరిహారంగా రూ.50 లక్షలు చెల్లించాలని రిచ్‌మండ్ టౌన్‌కు చెందిన దివ్య కిరణ్ బీబీఎంపీకి ఈ నోటీసును పంపారు.

పాక్ ఆర్మీ చీఫ్‌కి ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి

భారత్‌తో ఉద్రిక్తతల వేళ ప్రమోషన్

ఇస్లామాబాద్: భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకున్నది. సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిమ్ మునీర్‌కి ఫీల్డ్ మార్షల్‌గా మంగళవారం పదోన్నతి కల్పించింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.భారత్‌తో పోరులో పాక్ బలగాలను ముందుండి నడిపించినందుకే ఆయన ప్రమోషన్ ఇచ్చినట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. ఫీల్డ్ మార్షల్ అన్నది పాక్‌లో అత్యున్నత మిలిటరీ ర్యాంకు. పాక్‌లో ఈ హోదా పొందిన రెండో వ్యక్తి మునీరే కావడం విశేషం. ఇంతకుముందు 1959లో జనరల్ ఆయుబ్ ఖాన్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా కట్టబెట్టారు. 2022 నవంబర్‌లో ఆర్మీ చీఫ్‌గా మునీర్ బాధ్యతలు చేపట్టారు. మునీర్‌కు ఆ దేశ సుప్రీంకోర్టు ఇటీవలే మరిన్ని అధికారాలు కల్పించింది. మిలిటరీ కోర్టుల్లో పౌరులను విచారించేందుకు అనుమతించింది. తాజాగా ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి లభించడంతో మునీర్ ప్రాబల్యం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

భారత ఏజెంట్లను గుర్తించేందుకు..!

- యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను ఉపయోగించుకున్న ఐఎస్ఐ
- వాట్సాప్ చాట్‌లు వెలుగులోకి

న్యూఢిల్లీ, మే 20: భారతీయ అండర్‌కవర్ ఏజెంట్లను గుర్తించేందుకు హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) ఉపయోగించుకున్నట్లు మంగళవారం అధికార వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్ కోసం గూఢచారిగా పనిచేసిన జ్యోతి ప్రస్తుతం ఐదు రోజుల పోలీసు కస్టడీలో ఉంది. ఆమెను ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ), హర్యానా పోలీసులతో కూడిన సంయుక్త బృందం ప్రశ్నిస్తున్నది.

కోడ్ భాషలో వాట్సాప్ చాట్స్

అలీ హసన్ అనే ఐఎస్ఐ హ్యాండ్లర్, జ్యోతి మధ్య జరిగిన వాట్సాప్ చాట్లు వెలుగుచూసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. భారతదేశ అండర్‌కవర్ ఆపరేషన్లకు సంబంధించి సంకేత భాషలో వారి మధ్య సాగిన సంభాషణలు దర్యాప్తు బృందానికి లభించాయి.

అల్జీమర్స్‌ను గుర్తించే రక్తపరీక్ష

వాషింగ్టన్: అల్జీమర్స్ వ్యాధిని ముందుగానే గుర్తించే రక్తపరీక్ష ఈ ఏడాది జూన్ నుంచి అమెరికాలో అందుబాటులోకి రాబోతున్నది. జపాన్ కంపెనీ అభివృద్ధి చేసిన నరికొత్త మెడికల్ టెస్ట్‌కు అమెరికాలోని ఎఫ్‌డీఏ గతవారమే ఆమోదము